సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 17 । జనవరి । 2023



అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం
అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. 8లో▸



హక్కులతో మెరుగైన సమాజం
భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. 8లో▸



జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం
తెలంగాణ ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిదని నేతలు కొనియాడారు. 8లో▸

న్యూస్‌రీల్

కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి

సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సీఎస్ శాంతకుమారి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 19న ఉదయం 9 గంటలకు మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేటలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. 558 గ్రామ పంచాయతీలు, 23 జీహెచ్ ఎంసీ వార్డులు, 358 యూఎల్‌బీసీల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 80 వైద్య బృందాలు ఏర్పాటు చేశామని, మరో నాలుగు బృందాలను అదనంగా సమకూర్చినట్లు తెలిపారు. జిల్లాకు ఇప్పటికే 1,04,409 రీడింగ్ గ్లాసులు చేరుకున్నాయని, మిగిలినవి త్వరలోనే అందనున్నాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, ఆర్డీఓలు వెంకటాచారి, రాజేశ్వరి, చంద్రకళ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈ నెల 30 వరకు ఉచిత బియ్యం పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. ఈ- పాస్ సాంకేతిక సమస్య కారణంగా ఉచిత బియ్యం పంపిణీ ప్రక్రియ పది రోజులు ఆలస్యంగా ప్రారంభమైంది. కరోనా ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 2020 ఏప్రిల్ నుంచి యూనిట్ (ఒక్కొక్కరికి) ఉచితంగా 5 కిలోల చొప్పున బియ్యం కోటా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద యూనిట్‌కు మరో 5 కిలోలు కలిపి లబ్ధిదారుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కింద ఈసారి కూడా ఎప్పటి మాదిరిగా 5 కిలోల చొప్పున బియ్యం కోటా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి తన వాటా చేర్చకుండా యూనిట్‌కు 5 కిలోలకు పరిమితం చేసింది. ఈ- పాస్ యంత్రంలో యూనిట్‌కు 10 కిలోలు ఉన్న కారణంగా పంపిణీకి అడ్డంకిగా తయారైంది. తాజాగా ఈ- పాస్ యంత్రాల్లో యూనిట్‌కు 5 కిలోల చొప్పున మార్పిడికి కొంత సాంకేతిక సమస్య ఏర్పడింది. ఈ ప్రక్రియ పూర్తికి కొంత ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీంతో ఈ నెల కోటా 30 వరకు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

19 వరకు చౌమహల్లా ప్యాలెస్ మూసివేత

చార్మినార్: అసఫ్ జాహీల రాచరిక పాలనకు అద్దం పట్టే విధంగా ఉన్న చౌమహల్లా ప్యాలెస్‌ను 5 రోజుల పాటు క్లోజ్ చేశారు. టర్కీలో మృతి చెందిన 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ ముఖర్రం జా బహదూర్ భౌతిక కాయాన్ని చౌమహల్లా ప్యాలెస్‌కు తరలించనున్నారు. ఈ నెల 17న సాయంత్రం నగరానికి ప్రత్యేక విమానంలో ఆయన భౌతికకాయాన్ని తరలించిన అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌కు తీసుకురానున్నారు. ముఖర్రం జా బహదూర్ భౌతికకాయాన్ని 18 వరకు ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. దీంతో ఈ నెల 15 నుంచి 19 వరకు పర్యాటకులకు అనుమతి లేదంటూ చౌమహల్లా ప్యాలెస్ ప్రధాన ద్వారం వద్ద నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు.

పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్ల పెంపు

సనత్‌నగర్: పాస్‌పోర్టు దరఖాస్తుదారులు అపాయింట్‌మెంట్ల కోసం చాలాకాలం నిరీక్షించకుండా మరిన్ని సాధారణ, తత్కాల్ అపాయింట్‌మెంట్‌లను పెంచినట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య సోమవారం తెలిపారు. బేగంపేట ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రంలో సాధారణ పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్‌లు 50, తత్కాల్ 50, అమీర్‌పేట పీఎస్‌కేలో సాధారణ 25, తత్కాల్ 25, టోలిచౌకి పీఎస్‌కెలో సాధారణ 25, తత్కాల్ 25, నిజామాబాద్ తత్కాల్ 20 అపాయింట్‌మెంట్‌లను పెంచినట్లు ఆయన తెలిపారు. పెంచిన అపాయింట్‌మెంట్‌లు 16వ తేది నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. గత మాసంలో 5 ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 14 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో వరుసగా 4 శనివారాల్లో ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా అపాయింట్‌మెంట్‌ల లభ్యత పెంచినట్లు వివరించారు.

కాపాడాల్సినవాడే.. కడతేర్చాడు

భార్య, కుమార్తె, తల్లిని చంపి.. తాను ఆత్మహత్య

కంటికిరెప్పలా ఇంటిల్లిపాదినీ కాపాడేవాడే, కుటుంబానికి అండగా ఉండాల్సినవాడే దారుణానికి ఒడిగట్టాడు. కన్నతల్లిని, కట్టుకున్న ఇల్లాలిని, అభమూ శుభమూ తెలియని కన్న కూతురునూ కడతేర్చాడు. చివరికి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

- నగరంలోని తార్నాకలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఘాతుకం
- చెన్నై వెళ్లేందుకు కుటుంబం నిరాకరించడంతో దారుణం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు




భార్య సింధూరతో ప్రతాప్


చిన్నారి ఆద్య

సాక్షి, సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలో ఘోరం జరిగింది. తనతో చెన్నై రావడానికి నిరాకరించిన భార్యతో పాటు కుమార్తెను, కన్నతల్లిని చంపేశాడు. ఆపై తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఓ ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం ఈ విషాద ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. చెన్నైకి చెందిన ప్రతాప్ (34) అక్కడి ఓ కార్ల కంపెనీలో డిజైన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం తార్నాక ప్రాంతానికి చెందిన సింధూర (32)తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఆద్య ఉంది. సింధూరకు రెండు నెలల క్రితం హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమెతో పాటు ఆద్య, ప్రతాప్ తల్లి రాజతి నగరానికి వచ్చారు. తార్నాకలోని రూపాలీ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. చెన్నైలోనే ఉద్యోగం చేస్తున్న ప్రతాప్ వారాంతాల్లో ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడు. చెన్నై వెళదామనే విషయంపై కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

బెడ్రూంల్లో నిద్రిస్తుండగా..

చెన్నైలో స్థిరపడటానికి ఉద్యోగం వదిలి రావాలంటూ భార్య సింధూరపై ప్రతాప్ ఒత్తిడి తెస్తున్నాడు. దీనికి ఆమె అంగీకరించడంపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ వీకెండ్‌లో రావడంతో శుక్రవారం ప్రతాప్ నగరానికి వచ్చాడు. చెన్నై వెళ్లే విషయమై రెండు రోజులుగా వీరి మధ్య గొడవలు జరిగి ఆదివారం రాత్రి తారాస్థాయికి చేరింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ప్రతాప్.. కుటుంబాన్ని హతమార్చి తానూ తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ప్రధాన బెడ్రూంలో నిద్రిస్తున్న భార్య, కుమార్తెను, కొద్దిసేపటి తర్వాత పక్కనే మరో బెడ్రూంలో పడుకుని ఉన్న తల్లినీ చంపివేశాడు. హాల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సింధూర సహోద్యోగులు ఫోన్ చేయడంతో..

సింధూర సోమవారం విధులకు హాజరుకావాల్సి ఉంది. ఆమె బ్యాంక్‌కు రాకపోవడంతో ఆరా తీసేందుకు సహోద్యోగులు ఫోన్ చేశారు. సింధూర నుంచి స్పందన రాకపోవడంతో మధ్యాహ్నం వరకు ప్రయత్నించారు. చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సింధూర అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. ఎంత పిలిచినా లోపల నుంచి స్పందన లేకపోవడంతో పక్కన అపార్ట్‌మెంట్‌లో నివసించే సింధూర తల్లి జమునను తీసుకువచ్చారు. వీరికి ఫ్లాట్‌లోకి హాల్‌లో ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రతాప్ మృతదేహం కనిపించింది. బెడ్స్‌పై ఉన్న సింధూర, ఆద్యలను పరిశీలించారు. సింధూర కొన ఊపిరితో ఉండటంతో సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స ప్రారంభించడానికి ముందే ఆమె తుది శ్వాస విడిచింది. నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. సింధూర తల్లి జమున ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు



'ప్రతాప్ మాకు దగ్గరి బంధువు హైదరాబాద్ నుంచి చెన్నై షిఫ్ట్ కావాలనే విషయంపై భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ.. ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు' అని జమున మీడియాతో అన్నారు. రాజతి మెడపై ఉన్న గుర్తుల్ని బట్టి ఉరి బిగించి లేదా గొంతు నులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. సింధూర, ఆద్యల మృతికి కారణాన్ని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. పోస్టుమార్టం పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక నివేదిక వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ తెలిపారు. కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సింధూర కోసం వాళ్ల ఆఫీస్ వారు వచ్చి చూసే దాకా ఇంతటి ఘోరం జరిగిందని నాకు తెలియదు. ఆమె ఫోన్ ఎత్తట్లేదు అని ప్రతాప్ కూడా స్పందించట్లేదని కంగారు పడుతూ వచ్చి చెప్పారు. ఎంత కొట్టినా తలుపులు కూడా తీయట్లేదని ఆందోళన చెందారు. అప్పుడు వచ్చి చూస్తే ఈ ఘోరం కనిపించింది. మేం పక్క అపార్ట్‌మెంట్లో ఉంటాం. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే మా దగ్గరికి వస్తే సరిపోయేది కదా. ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు.

ఔటర్ లీజుపై డౌట్!

ఆశించిన ఆదాయం ఉండదంటున్న నిర్వహణ సంస్థలు

- 30 ఏళ్ల పాటు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ
- గత నెలలోనే ముగిసిన ప్రీబిడ్ మీటింగ్
- రీజినల్ రింగ్‌రోడ్డుతో ఆదాయం పడిపోనుందని అంచనా
- ప్రస్తుతం ఔటర్‌పై భారీగా వాణిజ్య వాహనాల రాకపోకలు



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డును లీజుకు ఇవ్వడం ద్వారా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్న ప్రభుత్వానికి నిర్మాణ సంస్థల నుంచి నిరాసక్తత వ్యక్తమవుతోంది. 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ మార్గాన్ని 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టిన విషయం విదితమే. టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానించింది. సుమారు రూ.8 వేల కోట్ల ఆదాయమే లక్ష్యంగా లీజు ప్రక్రియలో భాగంగా గత నెలలో హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 12 దిగ్గజ సంస్థలు పాల్గొన్నాయి. వివిధ అంశాలపై కొన్ని సంస్థలు సందేహాలు వ్యక్తం చేశాయి. భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో ఔటర్‌పై వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టవచ్చని పలు సంస్థలు సందేహం వ్యక్తం చేశాయి. దీంతో తమ పెట్టుబడులకు తగిన ఆదాయం లభించకపోవచ్చని పేర్కొన్నాయి. ప్రస్తుతం సుమారు 80 శాతం వాణిజ్య వాహనాలు ఔటర్ మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి.

పెరిగిన వాహనాల రాకపోకలు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే లారీలు, ట్రక్కులు వంటి వాణిజ్య వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాలు కూడా ఔటర్ నుంచి పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. శంషాబాద్, నానక్‌రాంగూడ, నార్సింగి, పటాన్‌చెరు, కండ్లకోయ, శామీర్‌పేట్, కీసర, ఘట్కేసర్, పెద్దఅంబర్‌పేట్ మీదుగా ప్రతి రోజు లక్షకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఈగిల్ ఇన్‌ఫ్రా సంస్థ టోల్ నిర్వహణ చేపట్టింది. దీనిద్వారా ప్రభుత్వానికి ఏటా కొంత మొత్తంలో ఆదాయం లభిస్తోంది. రహదారులు, విద్యుత్, పచ్చదనం తదితర నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పర్యవేక్షిస్తోంది. ఔటర్ మార్గాన్ని లీజుకు ఇవ్వడం ద్వారా భారీ ఎత్తున ఆదాయం లభిస్తుందని ప్రభుత్వ అంచనా. ఈ మేరకు ప్రణాళికలను రూపొందించి కార్యాచరణ చేపట్టారు.

ఆర్ఆర్ఆర్ ప్రత్యామ్నాయం..

- ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే బెంగళూరు జాతీయ రహదారి మీదుగా అంతర్రాష్ట్ర వాహనాలు షాద్‌నగర్ వద్ద ఆర్ఆర్ఆర్ మీదుగా కంది మార్గంలో ముంబైకి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ వాహనాలు శంషాబాద్ వద్ద ఔటర్‌పైకి ప్రవేశించి పటాన్‌చెరు నుంచి ముంబై రూట్‌లో వెళ్తున్నాయి. ఆర్ఆర్ఆర్ అందుబాటులోకి వస్తే బెంగళూరు- ముంబై మధ్య నడిచే వాహనాలకు చాలా వరకు దూరం తగ్గడమే కాకుండా సమయం కలిసి వస్తుంది.
- బెంగళూరు జాతీయ రహదారి నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు చౌటుప్పల్ వద్ద ఆర్ఆర్ఆర్ పైకి ప్రవేశించి షాద్‌నగర్ వరకు వెళ్లొచ్చు. ప్రస్తుతం ఈ వాహనాలు ఔటర్‌పై పెద్దఅంబర్‌పేట్ -శంషాబాద్ మార్గంలో వెళ్తున్నాయి. ఓఆర్ఆర్‌పై 80 శాతం ఆదాయం భారీ కమర్షియల్ వాహనాల నుంచే లభిస్తోంది. కంటైనర్లు, లారీలు, ట్రక్కులు వంటివి సుమారు 1.06 లక్షల వాహనాలు నడుస్తున్నాయి. ఈ వాహనాలు భవిష్యత్తులో ఆర్ఆర్ఆర్ వైపు మళ్లే అవకాశం ఉంది.

ఇదీ రీజినల్ రోడ్డు మార్గం

- ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరం దిశలో సంగారెడ్డి, కంది, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, యాదాద్రి, చౌటుప్పల్ మీదుగా చేపట్టనున్నారు. దక్షిణం దిశలో ఇబ్రహీంపట్నం, కందుకూరు, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డికి చేరుకుంటుంది. రీజినల్ రింగ్ రోడ్డు మొత్తం 340 కి.మీ. ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ చేపట్టింది. మొదట ఉత్తరం వైపు ఆర్ఆర్ఆర్ పూర్తి చేసి అనంతరం దక్షిణం వైపు చేపట్టనున్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ కష్టపడి పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీ ఏ బ్లాక్ కమిటీ సభ్యుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టనున్న హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా శ్రేణులు కదిలిరావాలన్నారు. ఈ నెల 26న పార్టీ జెండాలు ఆవిష్కరించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిరిగింత పారిజాత, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జి.ప్రభాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, ఉపాధ్యక్షుడు ఖాజామోహినుద్దీన్, జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి తల్లోజు వినోద్‌చారి, సొసైటీ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల వెంకటేశ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.గణేశ్‌నాయక్, తుక్కుగూడ అధ్యక్షుడు జంపన్న యాదవ్, ఎండీ అఫ్జల్, శివగల్ల యాదయ్య, వీరేష్, రాజు, రమేష్, జైపాల్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, బాబు, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పార్టీని కాపాడుకోవాలి

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఇక్కడ పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేటలో సోమవారం పార్టీ సభ్యుల బీ బ్లాక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందని 'కిట్లు'.. తప్పని పాట్లు

- నిలిచిన హెల్త్ అండ్ హైజిన్ కిట్ల పంపిణీ
- రెండేళ్లుగా ఆగిపోయినా సరఫరా
- కిట్లకు బదులు డబ్బులు ఇవ్వాలని యోచన
- ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే నిర్ణయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న కిషోర బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హెల్త్ అండ్ హైజిన్ కిట్ల' పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ఫలితంగా జిల్లాలో 95,962 మంది బాలికలకు న్యాప్‌కిన్లు అందకుండా పోయాయి. నెలసరి సమయంలో బాలికలే సమకూర్చుకోవాల్సి వస్తోంది. కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు అనారోగ్యం పాలవుతుండగా, మరికొందరు ఆ సమయంలో స్కూలుకు గైర్హాజరవుతున్నారు. ఇది వారి అభ్యసన సామర్థ్యంపై ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభమైనా..

ప్రభుత్వ పాఠశాలతో పాటు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న 12-18 ఏళ్లలోపు బాలికల కోసం 2018-19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం హెల్త్ అండ్ హైజిన్ కిట్ల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సబ్బులు, షాంపూలు, కొబ్బరి నూనె, టూత్ బ్రష్, పేస్ట్, టంగ్ క్లీనర్, న్యాప్‌కిన్లు, రిబ్బన్లు, దోమల నివారణ బిళ్లలు, హ్యాండ్‌వాష్ తదితర వస్తువులను కిట్ రూపంలో విద్యార్థినులకు ఉచితంగా అందజేసేవారు. ఒక్కో కిట్ విలువ రూ.400 కాగా ఏటా నాలుగుసార్లు అందజేయాలని నిర్ణయించారు. ఏడాది పాటు సక్రమంగా అమలు చేసినా కరోనా కారణంగా పాఠశాలలు మూతపడటంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. విద్యా సంస్థలు పునఃప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా కిట్ల పంపిణీని మాత్రం తిరిగి ప్రారంభించలేదు. కిట్ల స్థానంలో డబ్బులు ఇవ్వాలని నిర్ణయించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా అనేక మంది బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆరోగ్య సమస్యలు



నెలసరిపై సరైన అవగాహన లేకపోవడం, శుభ్రత పాటించక పోవడంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రక్తస్రావంతో నెలలో నాలుగైదు రోజులు బడికి గైర్హాజరవుతుంటారు. ఈ సమయంలో పాఠ్యాంశాల బోధన, సాధన, ఇతర అంశాలకు దూరమవుతుంటారు. ఆత్మస్థైర్యం కోల్పోయి మానసిక వేదనకు గురవుతుంటారు. కౌమార దశలోని పిల్లల ఆరోగ్య భద్రత తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వానిది కూడా.

– డాక్టర్ బాలాంబ, ప్రముఖ గైనకాలజిస్టు

నామమాత్రంగా సరఫరా



కోవిడ్ తర్వాత కిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని స్కూళ్లలో నామమాత్రంగా పంపిణీ చేస్తే మరికొన్ని చోట్ల సరఫరా చేయలేదు. కౌమారదశలో వచ్చే శారీరక, మానసిక మార్పులపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తూ న్యాప్‌కిన్లు పంపిణీ చేసి ఆదుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థునుల ఆరోగ్యం దెబ్బ తినకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– కల్పన, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు

నీట మునిగిన బతుకులు

- కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి నలుగురు యువకుల దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు అన్నదమ్ములు, బావమరిది
- కన్నీటి సంద్రమైన మన్నెగూడ

ధారూరు: పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచే కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద సోమవారం విషాదఛాయలు అలుముకున్నాయి. పండుగ పూట సంతోషంగా గడిపేందుకు వెళ్లిన నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. పూడూరు మండలం మన్నెగూడకు చెందిన సొంత అన్నదమ్ములు లోకేశ్, వెంకటేశ్, వీరి చిన్నాన్న కొడుకు జగదీశ్‌తో పాటు మేనత్త కొడుకు రాజేశ్ ప్రాజెక్టు నీటిలో మునిగి మృత్యువాత పడటం మన్నెగూడలో విషాదం నింపింది. చనిపోయిన యువకులందరూ అవివాహితులే. వీరిలో వెంకటేశ్ కూకట్‌పల్లిలోని కోర్టు కాంప్లెక్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా ఇతని తమ్ముడు వెంకటేశ్ ఇటీవల నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించి, ఫైనల్ ఎగ్జామ్ కోసం చదువుతున్నాడు. వీరి మృతదేహాలను చూసేందుకు వచ్చిన మన్నెగూడవాసులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

అవే చివరి క్షణాలు

మన్నెగూడకు చెందిన ఓ కుటుంబంలోని తొమ్మిది మంది కోట్‌పల్లి అందాలను వీక్షించేందుకు వెళ్లారు. ప్రాజెక్టు చుట్టూ ఉన్న అడవిలో కొద్దిసేపు సరదాగా గడిపారు. అనంతరం ప్రాజెక్టు నీటిలో దిగి సంతోషంగా కేరింతలు వేశారు. ఇవే తమ జీవితంలో చివరి క్షణాలని ఆ నలుగురూ అనుకోలేదు. ఈత వచ్చిన లోకేశ్, జగదీశ్ దూరంగా ఉన్న బండరాయిని తాకి ఒడ్డుకు రావాలని పందెం వేసుకున్నారు. ఈతరాని ఏడుగురు మోకాళ్ల లోతు నీరున్న ప్రాంతంలో ఎంజాయ్ చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిలోని రాయిని తాకి ఒడ్డుకు వస్తున్న ఇద్దరిని చూసిన వెంకటేశ్, రాజేశ్.. వీరికి ఎదురుగా వెళ్లే ప్రయత్నంలో నీట మునిగారు. వీరిని కాపాడేందుకు ముందుకు వచ్చిన లోకేశ్, రాజేశ్‌ను గట్టిగా పట్టుకున్నారు. దీంతో నలుగురూ నీట మునిగారు.

రక్షణ చర్యలు కరువు

కోట్‌పల్లి నీటిలో ఎంజాయ్ చేసేందుకు వస్తున్న వారిలో కొంతమంది ప్రాణాలు కోల్పోవడం బాధిత కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగులుస్తోంది. ఈత రాకపోయినా నీటిలో దిగుతున్న వారిలో కొంతమంది అత్యుత్సాహం ప్రాణాల మీదకు తెస్తోంది. ఇలా ఏటా పదుల సంఖ్యలో పర్యాటకులు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. వందలాది మంది పర్యాటకులు వస్తున్న ప్రాజెక్టు వద్ద కనీస అవగాహన కల్పించడం, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం అమాయకుల ప్రాణాలను బలిగొంటోంది. అరకొర సంఖ్యలో పోలీసులు గస్తీ కాస్తున్నా వందలాదిగా తరలివచ్చే పర్యాటకులను అదుపు చేయడం వీరి వల్ల కావడం లేదు.


ప్రమాదానికి ముందు ప్రాజెక్టు నీటిలో సరదాగా ఆడుతున్న యువకులు, కుటుంబ సభ్యులు


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

మొగులయ్యకు సన్మానం


మొగులయ్యను సన్మానిస్తున్న పోలీసులు

తలకొండపల్లి: తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో పద్మశ్రీ కిన్నెర మొగులయ్యను సన్మానించారు. మరుగున పడ్డ జానపద కళలకు ప్రాణంపోసి దేశ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన మొగులయ్యకు ఇటీవల భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా సోమవారం తలకొండపల్లి పీఎస్‌లో ప్రజాప్రతినిధులు, పోలీసులు.. మొగులయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నర్సింలు శెట్టి, హెడ్ కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సోదరభావం

పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి


బహుమతులు అందజేస్తున్న చెన్నకేశవరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి తెలిపారు. పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపల్‌లోని బిగ్ బ్యాట్ క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు సమయం కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ఏఈ ఇంద్రసేనారెడ్డి, పరమేష్, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు వెంకట్‌రెడ్డి, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం

- రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

షాబాద్: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి బేగరి మహేశ్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన క్లెం ఆనంద్‌ను మండల కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసమానతల సమాజంలో సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బోడంపహాడ్ గ్రామ నాయకులు యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


ఆనంద్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహేశ్, సుబ్రహ్మణ్యం

గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్

అంబేడ్కర్ సంఘం బోండపహాడ్ గ్రామ అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చర్లగూడెం శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కార్యదర్శిగా రవికిరణ్, కోశాధికారిగా నరేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బందేశ్వర్, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు నర్సింహులు, ఎండీ రఫీక్, వెంకటేష్, శ్రీనివాస్, ఎండీ ఇనాయత్, కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులతో మెరుగైన సమాజం

ఆమనగల్లు: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకున్నప్పుడే మెరుగైన సమాజం ఆవిష్కృతం అవుతుందని ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో ఆదివారం గౌతమ్ ఫౌండేషన్ ప్రారంభ వేడుకలకు హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా, రాజ్యాంగం రాసుకుని 73 సంవత్సరాలు కావస్తు న్నా దేశం ఇంకా వెనుకబడే ఉందన్నారు. ఇందుకు కారణం పేదరికం, నిరుద్యోగం, విద్య, వైద్య వ్యవస్థలు పూర్తిగా విఫలం కావడమేనని పేర్కొన్నారు. వీటిని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. విద్య, వైద్యం, రెవెన్యూ, ప్రభుత్వ వ్యవస్థలు భ్రష్టుపట్టి సామాన్య మానవుడికి లబ్ధి చేకూర్చే ఆశయాలను ప్రభుత్వాలు విస్మరించాయని అన్నారు. అందరికి సమాన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లభించాలన్నా, మంచి అభివృద్ధి సాధించాలన్నా మన రాజ్యాంగాన్ని అమలు పరిచే నాయకులు మారాలని అభిప్రాయపడ్డారు. నాయకులు మారాలంటే ప్రజలంతా రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన ఉండాలన్నారు. ఉన్నతమైన విద్యావంతులు, వ్యవస్థ మీద పట్టు ఉన్న వ్యక్తులు రాజకీయ వ్యవస్థలో ఉండాలన్నారు. వ్యవస్థ ప్రక్షాళన దిశగా ముందుకు కదిలి మంచి నాయకులను ఎన్నుకొని, భారత రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ డెమొక్రటిక్ ఫోరం సభ్యులు డాక్టర్ పృథ్వీరాజ్, ఐక్యత చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, న్యాయవాది జగన్, నాయకులు రాఘవేందర్, పాపిశెట్టి రామ్, నర్సింహారెడ్డి, సాయికుమార్, కృష్ణ, రజనీకాంత్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత మృతి


సందీప్‌రెడ్డి (ఫైల్)

మల్లాపూర్: సంక్రాంతి వేడుకలకు స్నేహితులతో కలిసి ఆంధ్రాకు వెళ్లి హైదాబాద్‌కు వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో నాచారం ప్రాంతానికి చెందిన మొసలి సందీప్ రెడ్డి(35) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొసలి సందీప్‌రెడ్డి తన స్నేహితులు గంగులోతు శరత్ భార్గవ్, జాఫర్‌లతో కలిసి కారులో సంక్రాంతి వేడుకల కోసం ఆంధ్రాకు వెళ్లాడు. ఆదివారం రాత్రి నగరానికి తిరిగివస్తుండగా మార్గ మధ్యలో పశ్చిమ గోదావరి జిల్లా, కొత్త పట్టిసీమ, పోలవరం సమీపంలో ఆదివారం రాత్రి కారు చెట్టును ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సందీప్‌రెడ్డి, శరత్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి.


కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన పూర్వ విద్యార్థుల జట్లు

అ'పూర్వ'ం.. అద్భుతం

- ఒకేచోట చేరిన 40 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు
- ఆటపాటలతో సందడి
- ఉత్సాహంగా కబడ్డీ పోటీలు
- విజేతగా అగ్ని, రైడో రైడర్స్ జట్లు

తుక్కుగూడ: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 40 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి ఆట పాటలతో సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ అద్భుత ఘట్టం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమైంది. సరస్వతి ఫౌండేషన్ రావిర్యాల - 1997 - 98 ఎస్సెస్సీ బ్యాచ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, కబడ్డీ పోటీలు నిర్వహించారు. 1983 నుంచి 2023 వరకు ఎస్సెస్సీ 40 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో 2002 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన అగ్ని జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా 1990 - 91 పులి జట్టు నిలిచింది. జూనియర్ విభాగంలో విన్నర్‌గా 2012 జవాన్స్ జట్టు, 2021 రైడో రైడర్స్ రన్నర్‌గా నిలిచారు. విజేత జట్లకు ఎండీ రషీద్ నగదు బహుమతి అందజేశారు. పూర్వ విద్యార్థులకు అదే పాఠశాలలో చదువుకున్న పల్లె గోపాల్ గౌడ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శకుంతల, విఠల్‌దాస్ గౌడ్, మురళీధర్‌రావు, రామచంద్రారెడ్డి, టీ రామచంద్రారెడ్డి, పాపయ్య, రఘునాథ్, హనుమాన్‌దాస్, 40 ఎస్సెస్సీ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గాలిపటం ఎగురవేస్తుండగా..

- భవనం పైనుంచి పడి కూలీ మృతి

మీర్‌పేట: గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి ఓ కూలీ మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన కత్తి నాగార్జున(38) హస్తినాపురం విశ్వేశ్వరయ్య కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తున్నాడు. ఆదివారం నిర్మాణంలో ఉన్న భవనం 6వ అంతస్తుపై చిన్నారులతో కలిసి గాలిపటం ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగార్జున మృతదేహం

రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం

- పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి

మాడ్గుల: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిదని పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం మాడ్గులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న జైపాల్‌రెడ్డి విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యులు కిషన్‌రెడ్డి, కొత్తపాండుగౌడ్, జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దివంగత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో జై పాల్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మండ్లీ రాములు, నాయకులు ఖలీల్, వెంకటేశ్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అభిమానులు

వలపు వల

హనీ ట్రాప్‌తో నిలువు దోపిడీ

- అమాయకులను గుర్తించి యువతులతో ఎర
- వారితో మాటలు కలిపి చాటింగ్స్, ఫొటోలు
- వీటిని బాధితులకు చూపించిన బెదిరింపులు
- 13 మందితో ఏర్పడిన ఘరానా ముఠా
- మహిళ మినహా మిగిలిన వారి అరెస్టు
- నిందితుల్లో ఓ మాజీ హోంగార్డు, బౌన్సర్



సాక్షి, సిటీబ్యూరో: ఓ ప్రాంతానికి చెందిన చోటామోటా వ్యాపారుల్లో అమాయకులను ఎంచుకోవడం... యువతులతో వారికి ఎర వేసి ఫొటోల వరకు తీసుకువెళ్లడం... వాటితో యువతుల బంధువులుగా రంగంలోకి దిగడం ... దాడులు, బెదిరింపులతో భయభ్రాంతులకు గురి చేసి అందినకాడికి దండుకోవడం ... ఈ పంథాలో రెచ్చిపోతున్న 'హనీట్రాప్స్ బందిపోటు' ముఠాను ముషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అరెస్టైన 12 మందిలో ఓ మాజీ హోంగార్డు, బౌన్సర్ ఉన్నట్లు మధ్య మండల డీసీపీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. చిక్కడపల్లి ఏసీపీ ఎస్.యాదగిరితో కలిసి సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు.

హోంగార్డుగా పని చేస్తూ నేరాలు...

ముషీరాబాద్ పరిధిలోని దయారా మార్కెట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ విఖార్ మెహ్దీ గతంలో నగర భద్రతా విభాగంలో హోంగార్డుగా పని చేశారు. 2013లో పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ, బెదిరింపులకు పాల్పడి జైలుకు వెళ్లాడు. 2016లో నోట్ల రద్దు తర్వాత పాత నోట్లకు కొత్త నోట్లు మార్పిడి పేరుతో దందా చేసి పలువురిని మోసం చేశాడు. దీనిపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో మరోసారి జైలుకు వెళ్లాడు. ఇతడి నేరచరిత్రను పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. విఖార్ జైల్లో ఉండగా తలాబ్‌కట్టకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్‌తో పరిచయమైంది. వీళ్లిద్దరూ కలిసి పంజగుట్టలో విఖార్‌తో కలిసి అరెస్టు అయిన సంతోష్‌నగర్ వాసి మహ్మద్ కలీం ఖాన్, ముషీరాబాద్‌కు చెందిన పాత నేరగాడు, విఖార్ సోదరుడైన సిరాజ్ జట్టు కట్టారు. పహాడీషరీఫ్, మెహదీపట్నం ప్రాంతాలకు చెందిన షేక్ సమీర, సైదా ఫాతిమా, మహ్మద్ ఇస్మాయిల్, అలీ, మజీద్ అహ్మద్, అహ్మద్ రిజ్వాన్, సయ్యద్ రఫీఖ్, షేక్ బషీర్, స్టేజ్ డ్యాన్సర్ హీనాలతో ముఠా ఏర్పాటు చేశారు.

చిరు వ్యాపారులను ఎంపిక చేసుకుని...

ఈ గ్యాంగ్‌లోని పురుషులు తమ ప్రాంతాల్లోని చిరు వ్యాపారుల్లో అమాయకులను టార్గెట్‌గా చేసుకుంటారు. వీరి ద్వారా విషయం తెలుసుకునే ముఠాలోని యువతులు, మహిళలు అతడి వద్దకు వెళ్తారు. ఆయా వ్యాపారాలకు సంబంధించి ఆర్డర్లు ఇవ్వడానికంటూ వ్యాపారుల ఫోన్ నెంబర్లు తీసుకుంటారు. ఆపై వారికి వాట్సాప్‌లో సందేశాలు పంపి చాటింగ్స్ చేస్తారు. ఓ ప్రాంతంలో కలుసుకోవడానికి రమ్మని పిలిచి వారితో ఫొటోలు దిగుతారు. ఈ ఫొటోలను తీసుకుని ముఠా సభ్యులు అసలు కథ మొదలెడతారు. ఆ వ్యాపారి వద్దకు వెళ్లి సదరు మహిళ తమ భార్య లేదా కాబోయే భార్య అని చెప్పి, ఆమెను లోబరుచుకుంటున్నావని బెదిరించి దాడి చేస్తారు. పోలీసులుగా ఎంట్రీ ఇచ్చే విఖార్, ఇమ్రాన్‌లు కేసుల పేరుతో, విలేకరి రూపంలో వచ్చే రిజ్వాన్ ఫొటోలు మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరిస్తాడు. దీంతో వారు సదరు వ్యక్తి నుంచి భారీ మొత్తం డిమాండ్ చేసి అందినకాడికి దండుకుంటారు.

మూడు ఠాణాల్లో నాలుగు కేసులు...

ఈ ఏడాది జూన్ నుంచి నేరాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌పై ఇప్పటి వరకు ఆసిఫ్‌నగర్, సంతోష్‌నగర్, ముషీరాబాద్‌ల్లో కేసులు నమోదయ్యాయి. ముషీరాబాద్‌కు చెందిన ఖమ్రుద్దీన్‌ను రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. వీరి వేధింపులు తట్టుకోలేక అతడు తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.5 లక్షలు ఇచ్చాడు. ఇదే ప్రాంత వాసి ఖలీల్ పాషా రూ.2.5 లక్షలు మరో ఇద్దరి నుంచి ఇంకొంత రాబట్టారు. ఇలా మొత్తం రూ.8.5 లక్షలు కాజేసిన, బెదిరింపులకు డమ్మీ పిస్టల్స్, కత్తులు వాడే వీరిపై ముషీరాబాద్‌లో బందిపోటు దొంగతనం సహా వివిధ ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. చిక్కడపల్లి ఏసీపీ ఎస్.యాదగిరి నేతృత్వంలో రంగంలోకి దిగిన నాలుగు బృందాలు హీనా సహా మిగిలిన 12 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.5 లక్షల నగదు, రెండు డమ్మీ తుపాకులు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేశారు. వీరిలో అర్హులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, వీరి బారినపడిన బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు రావాలని డీసీపీ రాజేష్ చంద్ర కోరారు.

వెంటాడి గొంతు కోసేశారు..

- తమ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడనే కోపంతో యువతి కుటుంబసభ్యుల ఘాతుకం

లంగర్‌హౌస్: బావ మరదళ్లు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహం నచ్చని అమ్మాయి కుటుంబీకులు తమ అమ్మాయినే చంపి, వేధించి చంపారని ఆ నేరం ఆమె అత్త, భర్త, కుటుంబీకులపై నెట్టాలనుకున్నారు. విషయం తెలుసుకున్న భర్త మాట్లాడటానికి రావడంతో నడిరోడ్డుపై వెంటాడి గొంతు కోసి చంపిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంగిచెర్లలో ఉంటూ రిలయన్స్ రిటైల్ స్టోర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కలీం, గోల్కొండ సబ్జా కాలనీలో నివాసముండే మరదలు ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను తిరస్కరించిన అమ్మాయి కుటుంబీకులు ఆమె మరో మేనత్త కుమారుడితో మార్చిలో వివాహం చేయడానికి నిశ్చయించారు. వివాహ కొనుగోళ్ల కోసం పెళ్లికి 4 రోజుల ముందు కుటుంబసభ్యులందరూ షాపింగ్ వెళ్లగా కలీం ఆమెను ముంబై తీసుకెళ్లి వివాహం చేసుకుని నెల తర్వాత నగరానికి వచ్చారు. ఈ క్రమంలో కలీం కుటుంబసభ్యులను అమ్మాయి తరపున బంధువులు పలుమార్లు వేధింపులకు గురి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక తండ్రి అహ్మద్‌తో పాటు ఇద్దరు కుమారులు, మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా జైలు నుంచి మేలో బయటకు వచ్చారు. కేసు విత్‌డ్రా చేసుకోవాలని కలీం ద్వారా అతని అన్న మామను అడగగా వారు ఒప్పుకోలేదు. కక్ష పెంచుకున్న అమ్మాయి కుటుంబీకులు కలిసి ఉందామ ని నటిస్తూ అబ్బాయి కుటుంబీకులతో కలిసి ఉన్నారు. 45 రోజుల క్రితం అమ్మాయిని గోల్కొండలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. కలీంను వదిలేయాలని కుటుంబీకులతో పాటు గతంలో ఆమెతో వివాహం నిశ్చయమైన వ్యక్తితో వేధిస్తున్నారు. వారం క్రితం అమ్మాయిని భర్త వద్దకు పంపి అక్కడే ఆమెను హత్య చేసి అత్తింటిపై నెట్టి హత్య చేశారని చెప్పి జైలుకు పంపాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలీం భార్య వేరొకరి ఫోన్‌తో ఈ విషయాన్ని భర్తకు వాయిస్ మెస్సేజ్ ద్వారా తెలియజేసింది. 5 రోజుల క్రితం గోల్కొండ పోలీసులను సంప్రదించగా వారిద్దరూ వేరు కాపురం పెడితే తాము ఒప్పుకుంటామని పోలీసుల ముందు అమ్మాయి కుటుంబీకులు చెప్పగా కలీం ఒప్పుకున్నాడు.

అద్దె గది చూపిస్తామని పిలిపించి..

తమ తల్లికి సర్జరీ అయ్యిందని, ఆమె మేడిపల్లిలోని ఆస్పత్రిలో ఉందని ఆమె బయటకు రాగానే చెప్పి తాము వేరు కాపురం పెడతామని కలీం ఆ అమ్మాయి కుటుంబీకులకు చెప్పాడు. తమ ప్రాంతంలోనే గది చూసామని నచ్చితే వచ్చి చూసి వెళ్లాలని ఆదివారం రాత్రి గోల్కొండకు రావాలని ఫోన్ చేశారు. 10 గంటలకు ఎండిలైన్స్ చేరుకున్న కలీంతో గొడవపడి అందరు చూస్తుండగా రోడ్డుపై వెంటాడి ముగ్గురు వ్యక్తులు కలీం గొంతు కోసి హత్య చేశారు. నిందితులు గోల్కొండ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.